# గోల్డ్ లోనా.. పర్సనల్ లోనా.. ఏది బెటర్?

- గోల్డ్ లోన్‌కు కనీస డాక్యుమెంట్లు ఉంటే చాలు.. 5 నిమిషాల్లో డబ్బులు తీసుకోవచ్చు
- పర్సనల్ లోన్‌కు చాలా డాక్యుమెంట్లు కావాలి.. రుణ మంజూరీకి కనీసం 48 గంటలు పడుతుంది



గోల్డ్ లోన్ తీసుకోవాలా? పర్సనల్ లోన్ తీసుకోవాలా? అనే సందేహం చాలా మందికి వచ్చే ఉంటుంది. అయితే రెండింటిలో ఏది బెటరో తెల్సుకోవడం కొంత కష్టమే. రెండు లోన్లపై పూర్తి అవగాహన ఉంటే తప్ప ఏ లోన్ తీసుకుంటే మంచిదో తెలియదు.

గోల్డ్ లోన్ తీసుకోవాలంటే మన దగ్గరున్న బంగారాన్ని తాకట్టు పెట్టాలి. మనం పెట్టే బంగారం విలువపై ఆధారపడి మనకు వచ్చే రుణ మొత్తం ఆధారపడి ఉంటుంది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం బంగారం విలువలో 75 శాతం వరకు రుణం ఇవ్వొచ్చు. పసిడి స్వచ్ఛత, మార్కెట్ ధర వంటి అంశాలు బంగారం విలువను నిర్దేశిస్తాయి. అయితే పర్సనల్ లోన్ విషయంలో మనం దేన్ని కూడా బ్యాంకులకు తాకట్టు పెట్టం. క్రెడిట్ స్కోర్, రీపేయింట్ కెపాసిటీ, వేతనం వంటి అంశాలు రుణ మంజూరు మొత్తాన్ని నిర్దేశిస్తాయి.

## వడ్డీ రేట్లు

గోల్డ్ లోన్‌పై వడ్డీ రేట్లు 9.6 శాతం నుంచి ప్రారంభమౌతాయి. అయితే పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు 11 శాతం పైమాటే. గోల్డ్ లోన్ కింద రూ.1,000 నుంచి రుణం పొందొచ్చు. అదే పర్సలోన్ కింద రుణ మొత్తం కనీసం రూ.5,000. అంటే రూ.5,000 కన్నా తక్కువ మొత్తాన్ని పర్సనల్ లోన్ కింద తీసుకోలేం.

## క్రెడిట్ స్కోర్ భయం లేదు

గోల్డ్ లోన్ అనేది సెక్యూర్డ్ లోన్. పర్సనల్ లోన్ అన్‌సెక్యూర్డ్ లోన్. అందుకే క్రెడిట్ హిస్టరీ గొప్పగా లేకున్నా కూడా గోల్డ్ లోన్ పొందొచ్చు. అదే పర్సనల్ లోన్ తీసుకోవాలంటే క్రెడిట్ స్కోర్ బాగుండాలి. అలాగే రీపేమెంట్ కెపాసిటీ చూస్తారు. క్రెడిట్ స్కోర్ బాగలేకపోతే లోన్ రిజెక్ట్ అవుతుంది. పర్సనల్ లోన్ నిబంధనలు బ్యాంక్ నుంచి మరో బ్యాంక్‌కు మారుతూ ఉంటాయి.

## డాక్యుమెంట్లు

ఇతర లోన్లతో పోలిస్తే గోల్డ్ లోన్‌కు తక్కువ డాక్యుమెంట్లు అవసరమౌతాయి. కేవైసీ, అడ్రస్ ప్రూఫ్ ఉంటే చాలు. గోల్డ్ లోన్ తీసుకోవచ్చు. అదే పర్సనల్ లోన్ తీసుకోవాలంటే చాలా డాక్యుమెంట్లు అవసరం అవుతాయి. ఐడెంటిఫికేషన్ ప్రూఫ్, అడ్రస్ ప్రూఫ్, ఇన్‌కమ్ ప్రూఫ్, బ్యాంక్ స్టేట్‌మెంట్ వంటివి కావాలి.

## రుణ మంజూరీ

కనీస డాక్యుమెంట్లు ఉంటే చాలు గోల్డ్ లోన్‌ను ఐదు నిమిషాల్లో పొందొచ్చు. అదే పర్సనల్ లోన్ విషయానికి వస్తే రుణ మంజూరీకి కనీసం 48 గంటలు పడుతుంది. కొన్ని సందర్భాల్లో కొంత మందికి వారం రోజులు కూడా పట్టొచ్చు. ఈ అంశాల ప్రాతిపదికన చూస్తే పర్సనల్ లోన్ కన్నా గోల్డ్‌లోనే బెటర్ అనిపిస్తోంది కదూ.

**Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only.**
**To know more, please visit: www.freegurukul.org**